ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

https://prajakalam.com
RNI No.TELTEL/2010/33275

# ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక


ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526

మంగళవారం | 11-03- 2025 సంపుటి: 15 , సంచిక: 341, నిజామాబాద్ పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

Circulated to Hyderabad,Ranagareddy,Nizamabad, Warangal, Mulugu, Shadnagar, Yadadri, Nalgonda, karimnagar, khammam, Medak, Sangareddy, Siddipet, Medchal, Jagityal,Vemulawada

## 39 సార్లు కాదు 99 సార్లు ఢిల్లీ పోతా..

# మీకేంది బాధ



### జీతభత్యాలు తీసుకుంటూ పనిచేయనిది కేసీఆర్ ఒక్కరే

పదేళ్లలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధం
కేంద్రానికి చెల్లించిన పన్నుల కంటే ఎక్కువ నిధులిస్తే
కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తా.. గండపెండేరం తొడుగుతా
కులగణన సర్వే వల్లే బడుగు నేతలకు ఎమ్మెల్సీ సీట్లు
పట్టభద్రుల ఓట్లను బీజేపీకి మళ్లించిన బీఆర్ఎస్

**హైదరాబాద్, మార్చి 10 (ప్రజాకలం ప్రతినిధి):** "తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2 నుంచి ఇప్పటివరకు కేంద్రానికి చెల్లించిన పన్నులు ఎన్ని? అందులో కేంద్రం తిరిగి తెలంగాణకు ఇచ్చింది ఎంత? ఏ రూపంలో ఇచ్చిన నిధులైనా.. లెక్కల ప్రాతిపదికన మాట్లాడుకుందాం. అన్నింటిపైనా చిత్తశుద్ధితో చర్చ చేద్దాం" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. చర్చకు తాను, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కలిసి వస్తామని, తెలంగాణ చెల్లించిన పన్నుల కంటే కేంద్ర ప్రభుత్వం అదనంగా నిధులు ఇస్తే అక్కడికక్కడే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తామని అన్నారు. తెలంగాణకు కేంద్రం రూ.10 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందంటూ కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం ఈ మేరకు స్పందించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. రాష్ట్రాలు చెల్లించిన పన్నుల్లో 42 శాతం నిధులను తిరిగి రాష్ట్రాలకు ఇస్తున్నట్లు చెబుతున్నారని, కానీ.. తిరిగి ఇస్తున్నది కేవలం 30 శాతమేనని చెప్పారు. విద్యా సెస్సు 4 నుంచి 5 శాతం వసూలు చేస్తున్న కేంద్రం.. అందులో నుంచి ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి ఇవ్వడంలేదని తెలిపారు. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సి ఉందని, దీనిపై చర్చించేందుకు కిషన్‌రెడ్డి రావాలని అన్నారు.


**ధర్నా చేయాల్సింది మోదీ ఇంటిముందు కదా!**

రీజినల్ రింగ్ రోడ్డును తామే ఇచ్చామంటూ ప్రధాని మోదీ పరేడ్ గ్రౌండ్‌లో ప్రకటించారని, అలాంటప్పుడు ఈ ప్రాజెక్టుకు భూ సేకరణ జరగొద్దంటూ బీజేపీ ఎంపీలు ఈటల, కె.లక్ష్మణ్ ధర్నా చేయాల్సింది ప్రధాని ఇంటి ముందు కదా! అని సీఎం రేవంత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు అన్నప్పుడు పద్ధతిగా భూ సేకరణ జరిపించాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, లక్ష్మణ్‌పై ఉందన్నారు.

తరువాయి 2వ పేజీలో...

# కొనసాగుతున్న అన్వేషణ!

## సహాయక బృందాలు గుర్తించిన డీ1, డీ2 ప్రాంతాల్లో తవ్వకాలు



- డీ2 ప్రాంతానికి చేరుకున్న ఎర్త్ మూవర్
- డీ1 షీర్ జోన్ కావడంతో ఆచితూచి తవ్వకాలు

మహబూబ్‌నగర్, దోమలపెంట, మార్చి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న వారి జాడ కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఆదివారం ఒక మృతదేహాన్ని వెలికితీయగా.. సోమవారం కూడా 12 ఏజెన్సీల ఆధ్వర్యంలో సహాయక బృందాలు తవ్వకాలు కొనసాగిస్తున్నాయి. దాదాపు 15 అడుగుల మేర మట్టి పేరుకుని ఉండటం.. తవ్వుతున్న కొద్దీ నీరు రావడం, వచ్చిన నీటిని పంపింగ్ చేసిన తర్వాతే మళ్లీ తవ్వకాలు చేపట్టాల్సి రావడం, మరోవైపు తవ్విన మట్టిని బయటకు తరలించే అవకాశం లేకపోవడంతో ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. ఎన్‌డీఆర్ఎఫ, క్యాడవర్ డాగ్స్, జీపీఆర్ గుర్తించిన కామన్ ప్రాంతాలకు డీ1, డీ2గా నెంబరింగ్ ఇవ్వగా.. డీ1 మొత్తం షీర్ జోన్ పరిధిలో ఉండడంతో అక్కడ తవ్వకాలను ఆచితూచి చేపడుతున్నారు. డీ1 నుంచి డీ2 మధ్య 20 మీటర్ల దూరం ఉంది. డీ2 ప్రాంతంలో ఆదివారం ఒక మృతదేహం లభ్యం కాగా.. ఆ ప్రాంతంలో ఇంకా మట్టి తవ్వకం జరుగుతోంది. డీ1 నుంచి డీ2 వరకు సింగరేణి ఆధ్వర్యంలో ట్రెంచ్ కట్ చేస్తున్నారు. టీబీఎం భాగాలను కట్ చేస్తూ ఒక పక్కకు వేస్తుండటంతో.. డీ2 ప్రాంతం వరకు సోమవారం సాయంత్రం ఒక జేసీబీ ఎర్త్ మూవర్ వెళ్లింది. దీంతో ఆ ప్రాంతంలో తవ్వకాలు వేగంగా జరిగే అవకాశం ఉంది. మంగళవారం లేదా బుధవారం మరో రెండు మృతదేహాలు లభ్యమయ్యే అవకాశం ఉన్నట్లు సహాయక బృందాలు చెబుతున్నాయి. క్యాడవర్ డాగ్స్ సోమవారం కూడా లోపలకు వెళ్లాయి.. కానీ మరే ఇతర ప్రాంతాలను గుర్తించలేదు. కాగా కన్వేయర్ బెల్టు పనిచేస్తున్న ప్రాంతం వరకు మట్టిని తరలించే వీలు లేకపోవడం, తవ్వుతున్న మట్టిని అక్కడే వేస్తుండడంతో ఆలస్యమవుతోంది. ఆదివారం లభ్యమైన గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహాన్ని పంజాబ్‌లోని చీమాకలాన్‌కు తరలించారు.

# చేతికొచ్చిన పంటల రక్షణే ప్రభుత్వ కర్తవ్యం

చివరి భూములకూ నీరందేలా చూడాలి
విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవు
మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు




**హైదరాబాద్, మార్చి 10 (ప్రజాకలం ప్రతినిధి):** చేతికొచ్చిన పంటలను కాపాడుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఆ దిశగానే పనిచేయాలని వారికి సూచించారు. ప్రాజెక్టుల నుంచి సాగునీటి విడుదల విషయంలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వాస్తవాలు ప్రజలకు వివరించాలన్నారు. సచివాలయం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన సోమవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ శాఖ అ?ధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రబీ సీజన్ పంట మరో 15 రోజుల్లో చేతికి రానుందని, అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. తొలుత ఆయకట్టు చివరి భూములకు నీరు అందేలా చూడాలన్నారు. పంటలు కీలక దశలో ఉన్నాయని, వాటిని కాపాడుకోవడానికి అవసరమైన ప్రయత్నాలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో నిజానిజాలు తెలుసుకోకుండా పంటల నష్టం గురించి దుష్ప్రచారం జరుగుతుందని, దీన్ని కట్టడి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బోర్లు ఎండిపోవడం, మోటార్లు కాలిపోవడం వంటి కారణాలతో పంటనష్టం జరుగుతుందంటూ.. రాజకీయంగా వాడుకోవడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వాస్తవాలు రైతులకు వివరిస్తూ ముందుకెళ్లాలన్నారు. ప్రణాళిక ప్రకారం రబీలో నీటిని అందించడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, నిరంతరం పరిస్థితిని గమనిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి చెప్పారు.

రబీ సాగులో రైతులకు ఇబ్బందులు లేకుండా నీటిని అందించడంతో పాటు 24 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ గుర్తుచేశారు.

### ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంతవరకు

## గ్రూప్ 1,2,3 ఫలితాలను నిలిపి వేయాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



**హైదరాబాద్ (ప్రజాకలం ప్రతినిధి):** ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఫరీక్షా ఫలితాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ప్రతీ ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టానికి రూపకల్పన చేయాలని అన్నారు. అప్పటి వరకు ఎటువంటి నియమాకులు చేపట్టొదని, అలా కాకుండా ముందుకు వెళితే కాంగ్రెస్ పార్టీ రాజకీయ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. సోమవారం గ్రూప్ 1, 2, 3 ఫరీక్షా ఫలితాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరై మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ గత నోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తింపజేస్తామని ఆగస్టు 1న అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 1, 2, 3, హెచ్‌డబ్ల్యూఓ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్స్ మొదలగు అన్ని ఉద్యోగ ఫలితాలను నిలిపి వేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు కొనసాగుతున్నాయని, తర్వాత శాంతియుత ధర్నాలు. రాస్తారోకోలు, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల ముట్టడి చేపడతామన్నారు. రిలే దీక్షల్లో తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్‌యాదవ్, తెలంగాణ విఠల్, సయ్యద్, ఇస్మాయిల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, గజ్జెల రాజశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.



## రేవంత్ చుట్టూ నలుగురు 'రియల్' బ్రోకర్లు

కేసీఆర్ అసెంబ్లీకి వస్తారు..
ఆయన స్థాయికి రేవంత్ సరిపోరు
మళ్లీ తెరపైకి ఫార్ములా-ఈ రేసు కేసు
చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్


హైదరాబాద్, మార్చి 10 : హైదరాబాద్‌లో అభివృద్ధి బదలాయింపు హక్కులు(టీడీఆర్), ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్‌లతో సీఎం రేవంత్‌రెడ్డి వందలు, వేల కోట్ల రూపాయల భారీ కుంభకోణానికి కుట్ర పన్నుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

తరువాయి 2వ పేజీలో...

# సీఎం రేవంత్ రాజీనామా చేయాలి

## కాంగ్రెస్ పాలనకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే రెఫరెండం

పంటలు ఎండిపోవడానికి రేవంత్ రెడ్డి వైఫల్యమే కారణం
కృష్ణా నీటిని చంద్రబాబు ఏపీకి తరలిస్తుంటే మౌనం : మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం



హనుమకొండ మార్చి 10 : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను తుక్కు తుక్కుగా ఓడించారని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. 15 నెలల పాలనకు రెఫరెండంగా నిలిచిన ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమికి బాధ్యతగా సీఎం రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు స్థలాన్ని పరిశీలించేందుకు సోమవారం హనుమకొండ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకుముందు హనుమకొండలో మరో చోట, జనగామలోనూ ప్రసంగించారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోవడానికి రేవంత్ వైఫల్యమే కారణమని ఆరోపించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. పాలన చేతకాక రేవంత్ తెచ్చిన కరువు అని విమర్శించారు. దేవాదుల కాంట్రాక్టర్‌కు రూ.7 వేల కోట్లు బిల్లులు చెల్లించకపోవడం వల్ల 33 రోజులు పంపుల మోటార్లు ఆన్ చేయలేదని.. సరైన సమయంలో మోటార్లు ఆన్‌చేసి ఉంటే రిజర్వాయర్లు నిండి పొలాలకు నీళ్లు వచ్చేవని చెప్పారు. రేవంత్ వైఫల్యం కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణానది నీటిని చంద్రబాబు ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్, మంత్రి ఉత్తమ్ కనీసం మాట్లాడలేదన్నారు. స్థానిక ఎన్నికలు సహా ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎసదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. 'ఇటీవల ఓ సభలో రేవంత్ ప్రధాని మోదీ మంచోడేనన్నారు. ఇప్పటికైనా కాంగ్రెసలో బీజేపీ కోవర్టులెవరో రాహుల్ గాంధీ తెలుసుకోవాలి' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ వేడుకలను వరంగల్ జిల్లాలో ఏప్రిల్ 27న ప్రారంభించి ఏడాది పాటు నిర్వహిస్తామని చెప్పారు. 14 ఏళ్ల ఉద్యమం, 9 ఏళ్ల పాలన మేళవింపే ఈ సభ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, రాజయ్య, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




## 39 సార్లు కాదు 99 సార్లు ఢిల్లీ పోతా..

# మీకేంది బాధ

మొదటి పేజీ తరువాయి...

హైదరాబాద్‌లో జైపాల్‌రెడ్డి తెచ్చిన మెట్రో కనిపిస్తుందే తప్ప.. కిషన్‌రెడ్డి తెచ్చిన మెట్రో కనిపించడంలేదని ఎద్దేవా చేశారు. మెట్రో, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్‌రోడ్డు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి మెజారిటీ నిధులు తెస్తే కిషన్‌రెడ్డికి నెక్లెస్ రోడ్డులో సన్మానం చేసి.. చేతికి గండపెండేరం తొడుగుతానన్నారు. భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనిది అయినప్పుడు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులపై భట్టివిక్రమార్క నేతృత్వంలో జరిగిన సమావేశంలో చర్చించేందుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ హైదరాబాద్‌కు వచ్చి సమీక్ష నిర్వహించినప్పుడు సికింద్రాబాద్‌లోనే ఉన్న కిషన్‌రెడ్డి.. ఆ సమావేశానికి వెళితే కేసీఆర్ బాధపడతారని హాజరు కాలేదా?అని నిలదీశారు. రాష్ట్ర అభివృద్ధిపై కిషన్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి ఇదీ అని ఎద్దేవా చేశారు.

**కులగణన వల్లే బడుగులకు ఎమ్మెల్సీలు..**

కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు ఐదు ఎమ్మెల్సీ సీట్లను బీసీ, ఎస్సీ, ఎస్టీలకే కేటాయించడం సమాజంలో వచ్చిన విప్లవాత్మక మార్పునకు నిదర్శనమని సీఎం రేవంత్ అన్నారు. కులగణన సర్వేలో తాము కులాలవారీ లెక్కలు తీసినందునే ఆయా వర్గాలకు న్యాయం చేయాల్సిన పరిస్థితి అందరికీ వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పార్టీ నిర్ణయమే తప్ప.. ప్రభుత్వ నిర్ణయం కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో హరీశ్‌రావు బీజేపీకి లొంగిపోయి.. బీఆర్ఎస్ ఓట్లను ఆ పార్టీకి మళ్లించారని రేవంత్ ఆరోపించారు. ఆయన దొంగ దెబ్బ తీయడం వల్లే తమ అభ్యర్థి ఓటమిపాలయ్యారని తెలిపారు. కానీ, మోసం తాత్కాలిక విజయాన్నే అందిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులందరూ సమన్వయంతోనే పని చేశారని తెలిపారు. ఇక రాష్ట్ర ప్రయోజనాల కోసం 99 సార్లయినా ఢిల్లీకి వెళతానన్నారు. గడిచిన 30 ఏళ్లలో సాధించుకురాలేని పనులను తాము ఈ 15 నెలల్లోనే సాధించుకొచ్చామన్నారు. కంటోన్మెంట్, రీజినల్ రింగ్‌రోడ్డు, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ వంటివి తెచ్చామన్నారు. ప్రధాని మోదీ తనకు సూచించినవన్నీ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాలేనని, వాటిని కచ్చితంగా పరిష్కరిస్తామని చెప్పారు.

**నేను సీఎంను.. కేసీఆర్ మాజీ సీఎం!**

కేసీఆర్ స్టేచర్ ఏంటి, రేవంత్ స్టేచర్ ఏంటంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ, "నేను ఈ రాష్ట్రానికి సీఎంను. కేసీఆర్ మాజీ సీఎం. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనొక పార్టీకి, నేనొక పార్టీకి అధ్యక్షులుగా ఉన్నాం. ఆ ఎన్నికల్లో కేసీఆర్‌ను అధికారం నుంచి దించాను. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్న చేశాను. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వచ్చేసరికి అభ్యర్థిని కూడా పెట్టలేకపోయారు. కేసీఆర్, కేటీఆర్‌కు బలుపు తప్ప ఏముంది? రోజూ ఇంత మందు తాగితే.. డ్రగ్స్ పార్టీల్లో పాల్గొంటే స్టేచర్ వస్తదా?"అని ఫైర్ అయ్యారు. అడ్డగోలుగా మాట్లాడటంలో కేసీఆర్‌ను మించినోడు దేశంలోనే లేడన్నారు. ఇప్పటిదాకా అసెంబ్లీలో తాను అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేసినట్లుగా రికార్డుల్లోనే లేదని తెలిపారు. ప్రతిపక్షం లేని రాజకీయం చేయాలని తాము కోరుకోవడంలేదని స్పష్టం చేశారు. ప్రజల నుంచి జీతభత్యాలు తీసుకుంటూ పనిచేయనివారు దేశంలో కేసీఆర్ ఒక్కరేనని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం అప్పులు రూ.3.75 లక్షల కోట్లేనని అబద్ధాలు చెప్పారని, తాము అధికారంలోకి వచ్చాక లెక్కలు చూస్తే రూ.7.11 లక్షల కోట్ల మేరకు అప్పులు ఉన్నాయని తెలిపారు. పదేళ్లలో అప్పులు, తప్పులు తప్ప కేసీఆర్, కేటీఆర్ చేసిందేమీ లేదని, వాటిని సరిదిద్దే ప్రయత్నం తాము చేస్తున్నామని చెప్పారు.

**కేంద్రం స్పందన చూశాక నిర్ణయం**

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీ తీర్మానంపై కేంద్ర ప్రభుత్వం స్పందన చూశాక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని రేవంత్ చెప్పారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న ప్రశ్నకు ఈ మేరకు స్పందించారు. కాగా, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వకముందు విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్లకు.. ఆయా నోటిఫికేషన్లలో పేర్కొన్న రూల్ ఆఫ్ రిజర్వేషనే వర్తిస్తుందని సీఎం స్పష్టం చేశారు. అప్పటి నోటిఫికేషన్లలో కొత్త రిజర్వేషన్లు అమలు చేయాలంటే కోర్టు కొట్టేస్తుందన్నారు. ఇప్పుడు ఇచ్చే రిజర్వేషన్లు అప్పటి నోటిఫికేషన్లకు వర్తించవన్నారు.

**55 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు..**

తెలంగాణలో ఏటా యాసంగిలో 30-35 లక్షల ఎకరాల మేర సాగవుతుందని, కానీ.. ఈ ఏడాది రైతులు 55 లక్షల ఎకరాలు సాగు చేశారని సీఎం రేవంత్ తెలిపారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లను సర్దుబాటు చేసి.. ఏ ప్రాజెక్టు కింద ఏ మేరకు నీళ్లు యాసంగికి ఇస్తామన్న దానిపై సాగునీటి శాఖ ముందే షెడ్యూల్ విడుదల చేసిందని, కానీ అందుబాటులో ఉన్న నీటి కంటే ఎక్కువ పంటను రైతులు వేశారని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో పంటలకు నీళ్లు అందకపోవడంపై ఈ మేరకు స్పందించారు. రాష్ట్రంలో రైతులు బాధపడుతుంటే, శవాలు లేస్తుంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తీన్మార్ డాన్సులు వేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వస్తే కరువు వస్తదంటూ ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని, కరువొస్తే రికార్డు స్థాయిలో 1.56కోట్ల టన్నుల ధాన్యం ఎలా పండిందని ప్రశ్నించారు. గతంలో నాటి ఏపీ సీఎం జగన్‌రెడ్డిని ప్రగతి భవన్‌కు పిలిచి పంచభక్ష పరమాన్నాలు పెట్టి.. రాయలసీమ లిఫ్టుకు తెరలేపింది కేసీఆర్ కాదా? అని రేవంత్ ప్రశ్నించారు. పదేళ్లలో కృష్ణా ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే ఆంధ్రావాళ్లతో ఇప్పుడు మనకు ఈ తలనొప్పే ఉండేది కాదన్నారు.

# రేవంత్ చుట్టూ నలుగురు 'రియల్' బ్రోకర్లు

మొదటి పేజీ తరువాయి...

సోమవారం కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. రేవంత్ చుట్టూ ఉన్న నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు టీడీఆర్‌ల సమాచారాన్ని సేకరిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి ఎఫ్ఎస్ఐ పరిమితులను విధించబోతున్నారని, దీనిపై త్వరలో ప్రకటన రాబోతోందన్నారు. రేవంత్ ముఠా టీడీఆర్‌లను తక్కువ రేట్లకు కొనుగోలు చేస్తుందని, ఎఫ్ఎస్ఐ పరిమితులను విధించాక టీడీఆర్‌ల డిమాండ్‌ను పెంచి అత్యధిక రేట్లకు అమ్మబోతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో భవనాలు ఎక్కువగా వస్తుండడంతో నగరాభివృద్ధికి ఇబ్బందులేర్పడుతున్నాయన్న సాకు చూపి టీడీఆర్‌లను ఎక్కువ రేట్లకు అమ్మే కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఇది ముమ్మాటికి ఇన్‌సైడర్ ట్రేడింగేనని.. సీబీఐ, ఈడీ దర్యాప్తు చేయదగ్గ స్కామ్ అని ఆరోపించారు. తన ఆరోపణల్లో నిజంలేకుంటే హైదరాబాద్‌లో టీడీఆర్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఎస్ఐపై పరిమితులు విధించరాదని గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని, తాము దాన్నే కొనసాగించామన్నారు. టీడీఆర్‌ల పద్ధతిలో జీహెచ్ఎంసీ ఇప్పటికే ప్రజల వద్ద నుంచి 400 ఎకరాల భూమిని సేకరించిదన్నారు. ప్రభుత్వ ఖజానాపై భారం పడకుండా, ప్రజలకు ఉపయోగపడే ఈ విధానాన్ని రేవంత్ తన అక్రమ సంపాదనకు మార్గంగా మార్చుకుంటున్నాడని చెప్పారు. ఇక బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే.. చనిపోయేదాకా ఆయన ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి బీజేపీకి కోవర్టుగా పని చేస్తున్నాడని, రాహుల్‌గాంధీ రాజస్థాన్‌లో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులున్నారంటూ చేసిన వ్యాఖ్యలు రేవంత్‌ను ఉద్దేశించినవేనని ఆరోపించారు. ఢిల్లీలో రేవంత్ మాట నడవడంలేదని, అందుకే ఆయన చెప్పినవారిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించలేదన్నారు. బీజేపీతో లోపాయికారి ఒప్పందాల కోసమే ఢిల్లీ వెళ్తున్నాడని ఆరోపించారు. 11 అంశాలతో ప్రధానిని కలిశానంటున్న రేవంత్ అసలు ఎజెండా వేరుగా ఉందని, మంత్రి శ్రీధర్‌బాబును బయటకు పంపి మోదీతో రేవంత్ ఏం మాట్లాడారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి దొంగాట ఆడుతున్నారని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం రోజు కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని చెప్పారు. కేసీఆర్ స్థాయికి రేవంత్ ఆవ గింజంత కూడా సరిపోడన్నారు. మరోసారి ఫార్ములా-ఈ రేసు కేసును ముందుకుతెస్తారని, 16న బడ్జెట్ పెట్టి 17న నోటీసులు ఇచ్చి మళ్లీ తనను పిలుస్తారని చెప్పారు. గతంలో 46 కోట్లతో ఫార్ములా-ఈ రేసు నిర్వహిస్తే అవినీతి, కేసులు అంటూ మాట్లాడిన రేవంత్ 200 కోట్లు పెట్టి ప్రపంచ సుందరి పోటీల నిర్వహణ వల్ల ఉద్యోగాలు వస్తాయా అన్నది చెప్పాలన్నారు.

# పాక్, ఆఫ్ఘన్ లకు అమెరికా వెళ్లడం కష్టమే

న్యూఢిల్లీ : అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్‌దుందుడుకు నిర్ణయాలతో అందరినీ భయపెడుతున్నారు. ఇప్పటికే నెల రోజుల పాలనలో అనేక సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో కొన్నింటిని అక్కడి కోర్టులు నిలిపివేశాయి. అయినా ట్రంప్ మాత్రం దూకుడు తగ్గించడం లేదు. తాజాగా ట్రావెల్ బ్యాన్‌పైదృష్టి పెట్టారు. డొనాల్డ్ ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా జనవరి 20, 2025న ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, ఆయన వలస విధానాల్లో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ట్రంప్ తాజాగా పాకిస్తాన్ మరియు ఆఫ్ఘనిస్తాన్ నుండి వచ్చే వ్యక్తులపై ట్రావెల్ బ్యాన్ విధించే అవకాశాన్ని పరిశీలిస్తోంది. ఈ బ్యాన్ వచ్చే వారం (అంటే మార్చి 10-16, 2025 మధ్య) అమలులోకి రావచ్చని సూచనలు ఉన్నాయి. ఈ నిషేధం దేశాల భద్రత, వీసా స్క్రీనింగ్‌ప్రక్రియలోని లోపాల ఆధారంగా రూపొందించబడుతోంది. జనవరి 20న ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, స్టేట్, జస్టిస్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ మరియు నేషనల్ ఇంటెలిజెన్స్ విభాగాలు మార్చి 12 నాటికి ట్రావెల్ నిషేధం విధించాల్సిన దేశాల జాబితాను సమర్పించాలని ఆదేశించింది. 2017లో ట్రంప్ ఏడు ముస్లిం ఆధిపత్య దేశాలపై విధించిన ట్రావెల్ బ్యాన్‌ను గుర్తు చేస్తూ, ఈ కొత్త బ్యాన్ కూడా ఇలాంటి ఉద్దేశంతోనే ఉండవచ్చు. ఆ బ్యాన్‌ను జో బైడెన్(ఏనీ ఃతిటవని)2021లో రద్దు చేశారు, కానీ ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో 20 ఏళ్ల యుద్ధంలో అమెరికాకు సహకరించిన లక్షలాది మంది ఆఫ్ఘన్‌లు రిఫ్యూజీ లేదా స్పెషల్ ఇమ్మిగ్రంట్ వీసాల (ూఎఎ) కింద అమెరికాలో స్థిరపడేందుకు ఎదురుచూస్తున్నారు. ఈ బ్యాన్ వారిని తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు. ఆఫ్ఘనిస్తాన్పూర్తి ట్రావెల్ బ్యాన్ జాబితాలో చేరుతుందని తెలుస్తోంది. సుమారు 2,00,000 మంది ఆఫ్ఘన్‌లు రిఫ్యూజీ లేదా ూఎఎ దరఖాస్తులతో ఆఫ్ఘనిస్తాన్ మరియు ఇతర 90 దేశాల్లో చిక్కుకున్నారు. వీరిలో 20,000 మంది పాకిస్తాన్(లో ఉన్నారు. పాకిస్తాన్ కూడా ఈ జాబితాలో చేరే అవకాశం ఉంది.

# బీజేపీకి స్పేస్ ఇచ్చిన మండలి ఎన్నికలు

### - ఉత్తర తెలంగాణలో పట్టు నిలుపుకున్న కమలం

నిజామాబాద్ : తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. ఓవైపు అ?ధికార కాంగ్రెస్, మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య నువ్వా - నేనా అన్నట్లు డైలాగ్ వార్ నడుస్తూ వస్తోంది. కట్ చేస్తే పార్లమెంట్ ఎన్నికల ఫలితాల నాటి నుంచి సీన్ లోకి బీజేపీ వచ్చేసింది. సందర్భాన్ని బట్టి కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేస్తూ ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఇదిలా ఉంటే, తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటి రాబోయే రోజుల్లో తమకు తిరుగు ఉండబోదన్న సందేశాన్ని ప్రత్యర్థి పార్టీలకు పంపే ప్రయత్నం చేసిందిఇటీవలే తెలంగాణలో మూడు స్థానాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు(2 టీచర్, 1 గ్రాడ్యుయేట్) జరిగాయి. అయితే ఉత్తర తెలంగాణ పరిధిలో జరిగిన టీచర్, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. టీచర్ల ఓట్లను తమ వైపునకు ఆకర్షించటంతో పాటు, కీలకమైన గ్రాడ్యుయేట్ ఎన్నికలోనూ జెండా ఎగరవేసింది. తద్వారా? 2 స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో 8 సీట్లు గెలిచి చరిత్ర సృష్టించిన కమలం పార్టీ, తాజాగా 2 ఎమ్మెల్సీలను ఖాతాలో వేసుకోవటం కీలక పరిణామంగా మారింది. అంతేకాదు? రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు బూస్ట్ దొరికినట్లు అయింది. ఇక ఈ విజయంతో ఆ పార్టీ జాతీయ నాయకత్వానికి? తెలంగాణపై మరింత ఆశలు పెంచుకునేలా చేసింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చామని. గతంలో ఏ ప్రభుత్వం చేయని విదంగా తమ పాలన ఉందంటూ మంత్రులు, నేతలు చెబుతూ వస్తున్నారు. కట్ చేస్తే తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టి షాకే తగిలింది. టీచర్ స్థానాలను పక్కనపెడితే గ్రాడ్యుయేట్ స్థానాన్ని అత్యంత సీరియస్ గా తీసుకుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని భావించింది. కానీ ఫలితం మాత్రం మరోలా వచ్చింది. పలువురు మంత్రులే కాకుండా స్వయంగా ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించినప్పటికీ? సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని కోల్పోయింది. ఈ ఫలితాలతో ఓ రకంగా హస్తం పార్టీకి గట్టి షాకే తగిలినట్లు అయింది. అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోవటం కాంగ్రెస్ పార్టీకి కాస్త ఇబ్బందికరమైన పరిణామమనే చెప్పొచ్చు. వచ్చిన ఏడాదిలోపే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెబుతున్నప్పటికీ పట్టభద్రులు తీర్పు మరోలా వచ్చింది. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు ఇస్తామని ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నామని ప్రచారం చేసినప్పటికీ. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపాలైంది. దీని బట్టి చూస్తే క్షేత్రస్థాయిలో వారు అనుకున్నంత సానుకూలత కనిపించటం లేదన్న విషయం స్పష్టమవుతోంది. మూడో స్థానంలో నిలిచిన బీఎస్పీ అభ్యర్థికి భారీగా ఓట్లు వచ్చాయి. ఇందులో మెజార్టీ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లేనన్న అభిప్రాయం గట్టిగా వినిపిస్తోంది. ఈ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన ప్రసన్న కుమార్(బీఎస్పీ) రెండో ప్లేస్ లో ఉంటే రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కతో ఫలితం మరోలా ఉండేది. ఇది గనుక జరిగితే. అధికార పార్టీ మరింత ఉక్కిరిబిక్కిరి అయ్యేది. కీలకమైన స్థానిక సంస్థల సమయంలో తాజా ఫలితాలు మింగుడు పడని పరిస్థితికి తీసుకువచ్చాయి. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ రోజుల్లోనే ప్రతికూల ఫలితాలు రావటాన్ని ఆ పార్టీ అధినాయకత్వం గమనించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అంటున్నారు. పైపై ప్రచారాలు కాకుండా క్షేత్రస్థాయిలోని పరిస్థితులను గమనించాలని అందుకు అనుగుణంగా అడుగులు వేస్తేనే అనుకూల ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయితే కాంగ్రెస్ కు కాకుండా పరోక్షంగా ఇతర అభ్యర్థులకు సహకరించిందన్న చర్చ ఉంది. ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా తప్పిదం చేసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు క్యాష్ చేసుకుంటే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గట్టి పోటీనిచ్చే అవకాశం దక్కేదన్న టాక్ వినిపిస్తోంది. నిజానికి ఉత్తర తెలంగాణ- బీఆర్ఎస్ కు ఆయువు పట్టు లాంటింది. కానీ గత కొంతకాలంగా ఇక్కడ పట్టు వీడుతోంది. కరీంనగర్ వంటి పార్లమెంట్ స్థానాన్ని వరుసగా రెండుసార్లు కోల్పోవాల్సిన పరిస్థితి కూడా వచ్చింది. ఇక ఇప్పటికే ఉత్తర తెలంగాణ పరిధిలో ఆరు ఎంపీలు, 7 ఎమ్మెల్యేలను గెలిచిన బీజేపీ తాజాగా రెండు ఎమ్మెల్సీలను కైవసం చేసుకుంది. తద్వారా తెలంగాణలో రోజురోజుకూ బలపడుతున్నామనే విషయాన్ని మరోసారి రుజువు చేసుకున్నట్లు అయింది. త్వరలోనే కొత్త అధ్యక్షుడిని నియమించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తిగా ఫోకస్ పెట్టే అవకాశం కనిపిస్తోంది?!రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులతో పోల్చితే? పార్లమెంట్ ఎన్నికల నాటికి పరిస్థితి మారిపోయింది. కాంగ్రెస్ కు 8 ఎంపీ సీట్లు మాత్రమే రాగా గతంలో ఎన్నడూ లేని విధంగా బీజేపీ 8 గెలుచుకుంది. ఇక బీఆర్ఎస్ ఖాతా కూడా తెరవలేకపోయింది. అయితే అంతా బాగుందన్న భావనలో ఉన్న అధికార పార్టీకి ఎమ్మెల్సీ ఫలితాలు షాక్ నిస్తే, బీజేపీకి మాత్రం మరింత స్పేస్ దొరికినట్లు అయింది. ఇక ప్రతిపక్ష స్థానంలో ఉన్న బీఆర్ఎస్. రెండు జాతీయ పార్టీలను కార్నర్ చేసే ప్రయత్నం చేసే పనిలోనే ఉంది?! స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామని వచ్చేది తమ ప్రభుత్వమేనని ధీమాను వ్యక్తం చేస్తోంది!



# అధికారుల వైఖరితోనే వివాదాలు

### - రామగుండంలో మాజీ కార్పొరేటర్లతో తలనొప్పి

### - అభివృద్ధి పనుల్లో తలదూరుస్తున్న వైనం - తలలు పట్టుకుంటున్న కార్పొరేషన్ యంత్రాంగం

కోల్‌సిటీ : రామగుండం కార్పొరేషన్‌లో అధికారుల వైఖరితో పలు డివిజన్లలో నాయకుల మధ్య వివాదాలు నెలకొంటున్నాయి. మున్సిపల్ పాలకవర్గాలకు పదవీకాలం పూర్తయిన తరువాత ప్రత్యేకాధికారుల పాలనలో పాలకవర్గ బాధ్యతలంతా అధికార యంత్రాంగమే చూసుకోవాలి. కానీ రామగుండం నగరపాలక సంస్థలోని కొన్ని విభాగాలు ఇప్పటికీ మాజీ కార్పొరేటర్ల మాటలకే ప్రాధాన్యతనిస్తుండడంతో వివాదాలు చోటు చేసుకుం టున్నాయి. పాలకవర్గం పదవీకాలం పూర్తయి నెల రోజులు దాటినా కొందరు తామే కార్పొరేటర్లమనే భావ నలోనే ఏన్నారు. పదవీకాలం పూర్తయినా అధికారం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 50డివిజన్లు ఉన్నాయి. పాలకవర్గం పదవీకాలం జనవరి 26తో ముగిసింది. ప్రస్తుతం కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో టీయూఎఫ్ఐడీసీ, ఎస్‌డీఎఫ్, సింగరేణి సీఎస్ఆర్, 15వ ఆర్థిక సంఘం తదితర నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, మేజర్ నాలాల ఆధునికీకరణ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం తదితర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ఏడాది ఎన్నికలు ఇతర కారణాలతో అభివృద్ధి పనులు జరుగలేదు. కార్పొరేటర్ల పదవీకాలం పూర్తయిన తరువాత ప్రత్యేక అధికారుల పాలనలో పనులు జరుగుతున్నాయి. దీంతో డివిజన్లలో తాము పెట్టిన పనులే జరుగుతున్నాయంటూ అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి హల్‌చల్ చేస్తున్నారు. దగ్గరుండి పనులు చేయిస్తున్నట్టు సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతుండడంతో వివాదాలు మొదలవుతున్నాయి. తాజా మాజీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఆశావాహుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొన్ని డివిజన్లలో అయితే పనులు జరుగుతున్న ప్రాంతంలోనే గొడవకు దిగుతున్నారు. ఇటీవల గోదావరిఖని ఫైవింక్లయిన్‌లోని ఒక డివిజన్‌లో ఓపెన్ డ్రైన్ పనుల వద్ద తాజా మాజీ కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్‌కు మధ్య జనం మధ్యనే గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. ఇలాంటి వివాదాలు ఇప్పుడు మెజార్టీ డివిజన్లలో చోటు చేసుకుంటున్నాయి. పని జరిగే చోట అధికారులతో వివా దాలు పడుతున్న సందర్భాలు చోటు చేసుకుంటు న్నాయి. తాజా మాజీ కార్పొరేటర్లకు కొందరు అధికా రులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఇతర నాయకులు వివాదాలు సృష్టిస్తున్నారు

**అధికార పార్టీలో నేతల మధ్య వివాదాలు**

రామగుండం నగరపాలక వర్గానికి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్నీ డివిజన్లలో అధికార పార్టీలో ఆశావాహులు ఎక్కువగా ఉన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన కార్పొరేటర్లతో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు ఆయా డివిజన్లలో ప్రాతినిధ్యం ఆశిస్తున్నారు. డివిజన్లలో అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యేకు అనునాయులుగా ఉన్న నాయకులు ఈసారి తామే బరిలో ఉంటామంటూ ప్రచారం చేసుకుంటుండడంతో వివాదాలు మొదలవుతున్నాయి. డివిజన్లలో ఎమ్మెల్యే పర్యటనల సందర్భంగా కూడా ఆశావాహుల మధ్య వివాదాలు చోటు చేసుకుంటు న్నాయి. తమకు అనుకూలమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మొదలు పెట్టాలంటూ ఎవరికి వారుగా యంత్రాంగంపై ఒత్తిడి తెస్తున్నారు. ఇటీవల అభివృద్ధి చెందిన ప్రాంతాలుగా ఉన్న రెండు డివిజన్లలో అభివృద్ధి పనుల విషయంలో వివాదాలు చోటు చేసుకున్నాయి. నాయకులు ఎవరికి వారుగా ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిళు తెచ్చారు. ముఖ్యంగా అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి పనుల్లో జోక్యం చేసుకోవడం, అధికారులు, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్న సందర్భాలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి.

# స్థలాలు అమ్మకాలే దిక్కా..

హైదరాబాద్ : తెలంగాణలో బీఆర్ఎస్ సుమారు పదేళ్లు అధికారంలో ఉంది. అప్పులు, సప్పులు చేసి ప్రజలకు కనిపించేలా అభివృద్ధి చేసింది. అయితే ఉద్యోగాల విషయంలో నిర్లక్ష్యం వహించడం, ఆ పార్టీ నేతల అరాచకాలు పెరిగిపోవడంతో 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరు గ్యారంటీ హామీలతోపాటు 420 హామీలు ఇచ్చారు. ఇవి కూడా ప్రజలను ఆకర్షించాయి. అయితే అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన నేతలు, ఇప్పుడు ఏడాది దాటినా మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతిలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ మినహా మరే హామీలు అమలుకావడం లేదు. ఇందుకు కారణం కూడా ఉంది. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. దీంతో హామీల అమలుకు రేవంత్‌రెడ్డి సర్కార్ వెనకాముందు ఆలోచిస్తోంది. దీంతో విపక్షాలు ఎన్నికల హామీలపై నిలదీస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ సర్కార్ నిధుల సమీకరణపై దృష్టి పెట్టింది. నిధులు ఉంటే పథకాలు అమలు చేయవచ్చన్న ఆలోచనతో కీలక నిర్ణయం తీసుకుంది. గచ్చిభౌలిలోని 400 ఎకరాల భూమిని వేలం వేయాలని నిర్ణయించింది. ఈ భూమి హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి గ్రామంలో సర్వే నంబర్ 25(ఖ) పరిధిలో ఉంది. ఇది సైబరాబాద్‌లోని ఒక ప్రధాన వాణిజ్య మరియు ఐటీ కేంద్రంలో భాగం. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఈ వేలం ప్రక్రియను నిర్వహిస్తోంది, దీని ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సుస్థిర మాస్టర్ ప్లాన్ లేఅవుట్‌ను రూపొందించి, దశలవారీగా భూమిని విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. భూముల వేలం ద్వారా సుమారు 30,000 కోట్ల రూపాయల ఆదాయాన్ని సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిధులను హామీలు నెరవేర్చడంతోపాటు కొత్త పథకాలు ప్రారంభించేందుకు, వివిధ అభివృద్ధి కార్యక్రమా కోసం ఉపయోగించనున్నారు. ఈ భూములు గతంలో ఎఓఉ భారత్‌కు సంబంధించినవిగా చెప్పబడుతున్నాయి. ప్రస్తుతం, ఈ ప్రాజెక్టు కోసం కన్సల్టెంట్‌లను ఎంపిక చేసేందుకు బిడ్డింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.



గచ్చిబౌలిహైదరాబాద్‌లోని ఒక కీలక ప్రాంతం, ఇక్కడ హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాలకు సమీపంలో ఉండటం వల్ల ఈ భూమికి గణనీయమైన విలువ ఉంది. ఈ చర్యపై కొందరు ఆర్థిక వనరుల సమీకరణకు మంచి అవకాశంగా చూస్తుండగా, మరికొందరు భవిష్యత్ పరిశ్రమల కోసం భూమిని కాపాడాలని వాదిస్తున్నారు. గచ్చిబౌలి హైదరాబాద్‌లోని ఒక ప్రధాన ఐటీ మరియు వాణిజ్య కేంద్రంగా ఉండటం వల్ల భూమి ధరలు చాలా ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా, గచ్చిబౌలిలో వాణిజ్య ప్రాంతాల్లో ఎకరం ధర 50 కోట్ల రూపాయల నుంచి 100 కోట్ల రూపాయల వరకు పలుకుతోంది. నివాస ప్రాంతాల్లో ఈ ధర కొంత తక్కువగా, అంటే ఎకరానికి రూ.30 కోట్ల నుండి రూ.60 కోట్ల వరకు ఉండే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని వేలం వేయాలని నిర్ణయించింది, వేలంలో ఈ ధర మార్కెట్ డిమాండ్ ఆధారంగా నిర్ణయించే అవకాశం ఉంది. ఈనెల 15 వరకు బిడ్డింగ్‌కు గడువు ఇస్తుంది. వేలం ద్వారా వచ్చిన ఆదాయంలో 0.003 శాతం టీజీఐఐసీకి వాటాగా ఇవ్వనుంది